క్లుప్తంగా

ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



భీమ్‌గల్: చేంగల్, బడా భీమ్‌గల్ గ్రామాల చర్చిలలో ఆదివారం నిర్వహించిన ప్రార్థనా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్‌లు ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఏసు ప్రభువు దీవెనలు ఉండాలని ఆకాంక్షించారు. ఎంపీపీ ఆర్మూర్ మహేష్, క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాణిక్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు పేరుతో మోసం

ఆర్మూర్‌టౌన్: పసుపు బోర్డు పేరుతో రైతులను మోసం చేసిన ఎంపీ అర్వింద్‌ను ఓడించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ కోరారు. ఆర్మూర్ పట్టణంలోని సీఐటీయూ కార్యక్రమంలో రైతుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యను పట్టించుకోని బీజేపీని ఓడించి ఇండియా కూటమి అభ్యర్థికి అవకాశం ఇవ్వాలన్నారు. నేతలు కుతాడి ఎల్లయ్య, ఈడ గొట్టి సాయిలు, నవీద్ పాల్గొన్నారు.

కుర్చీల విరాళం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్‌నగర్ హనుమాన్ ఆలయానికి ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో పట్వారీ గోపికృష్ణ, పిట్ల శశిధర్ 20 కుర్చీలను విరాళంగా అందజేశారు.. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ.. హనుమాన్ మందిర అభివృద్ధిలో భాగంగా తమ వంతు సహకారంగా కుర్చీలను అందజేశామన్నారు. రోటరీ కార్యదర్శి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు

భీమ్‌గల్: బాబాపూర్‌లో రెండు, గోన్‌గొప్పులలో ఒకటి, రూప్ల తండాలో రెండు సెంట్రల్ లైటింగ్‌లను జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి ఏర్పాటు చేయించారు. జెడ్పీ నిధులతో ఏర్పాటు చేయించినట్లు ఆయన తెలిపారు.

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

భీమ్‌గల్: రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతుల సంక్షోభానికి కారణమైన టెట్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్క జనార్దన్ డిమాండ్ చేశారు. ఆదివారం భీమ్‌గల్‌లో ఆయన మాట్లాడారు. పదోన్నతులకు టెట్ అవసరం లేదని పేర్కొంటూ ఏప్రిల్ 8న వచ్చిన వివరణ లేఖను వెల్లడించకుండా ఉపాధ్యాయులందరిని మానసిక వేదనకు గురి చేయడమే కాకుండా టెట్‌కు దరఖాస్తు చేయించడం ద్వారా లక్షలాది రూపాయలు వృథా చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని, గురుకులాల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పిచ్చిమొక్కల తొలగింపు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం కొనసాగుతుంది. కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు కలిసి శ్రమదానం చేశారు. పిచ్చిమొక్కలను తొలగించారు. కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ మాట్లాడుతూ.. పట్టణంలో స్వచ్ఛ కాలనీగా అవార్డు పొందిన తమ జర్నలిస్ట్ కాలనీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మున్సిపల్ పాలక వర్గం ప్రత్యేక నిధులను మంజూరు చేసి కాలనీలో అభివృద్ధి పనులు చేయాలన్నారు. కాలనీ సభ్యులు సుంకే శ్రీనివాస్, సత్యనారాయణ గౌడ్, కొంతం రాజు, సంతోష్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

పెర్కిట్(ఆర్మూర్): నియోజకవర్గంలోని జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి తెలిపారు. పెర్కిట్‌లోని పీవీఆర్ భవన్‌లో ఆదివారం జర్నలిస్టులతో ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో జర్నలిస్టులను నిర్లక్ష్యం చేశారన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లను అందజేయడానికి ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. అనంతరం జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను పరిశీలించి సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, సంజయ్ సింగ్ బబ్లూ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు గ్రహణం

- ముందుకు సాగని పనులు
- పనుల అసంపూర్తితో రోడ్డు ప్రమాదాలు
- రాజకీయ నేతల పైరవీలతో కుచించుకుపోయిన రోడ్డు
- నిబంధనలు వదిలేసిన ఆర్ అండ్ బీ అధికారులు



నందిపేట మండల కేంద్రంలో నిలిచిపోయిన రోడ్డు వెడల్పు పనులు

నందిపేట్(ఆర్మూర్): రోడ్డు విస్తరణ పనులకు గ్రహణం పట్టుకుంది. ఫలితంగా రోడ్డు వెడల్పు పనులు కొంతకాలంగా ముందుకు సాగడం లేదు. నందిపేట మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులు అసెంబ్లీ ఎన్నికలకు నెల రోజుల ముందు ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో పనులు చకాచకా జరిగాయి. దీంతో ఎన్నో ఏళ్ల కల నెరవేరుతుందని ప్రజలు సంతోషపడ్డారు. ఎన్నికల ముగిసిన వెంటనే పనులకు బ్రేక్ పడింది.

రూ.12 కోట్లతో పనులు

నందిపేటలోని వివేకానంద చౌరస్తా నుంచి పెద్ద మజీద్ వరకు 1.57 కిలోమీటర్ల వరకు సెంట్రల్ లైటింగ్‌తో కూడిన రోడ్డు వెడల్పు పనులతో పాటు ఒక కిలో మీటరు డ్రైనేజీ పనుల కోసం గత ప్రభుత్వం రూ.12 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో మధ్యలో నుంచి 50 ఫీట్ల రోడ్డును రెండు వైపులా వెడల్పు చేపట్టాలి. కాని మండల కేంద్రంలో ఇరువైపులా భవంతులు ఉండడం వల్ల కొద్ది మేర వెడల్పు తగ్గించి నిర్మాణం చేపట్టాలని అధికారులు భావించారు. కాని రాజకీయ నాయకులు జోక్యం చేసుకుని తమకు తెలిసిన వారి ఇళ్లు ఉన్నాయంటూ 40 ఫీట్లకు పరిమితం చేయాలని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. ప్రజాప్రతినిధులతో పాటు చోటామోటా నాయకుల ఒత్తిడి మేరకు చివరకు 35 ఫీట్లకు ఖాయం చేసి పనులు చేపట్టారు. ఇందులో మధ్యలో నుంచి 28 ఫీట్ల తారు రోడ్డు, 4 ఫీట్ల షోల్డర్‌ను వదిలి 4 ఫీట్ల డ్రైనేజీని ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల 4 ఫీట్ల షోల్డరును వదలకుండానే తారు రోడ్డును ఆనుకుని డ్రైనేజీని నిర్మించారు. ప్రభుత్వం ఇచ్చిన టెక్నికల్ సాంక్షన్ మేరకు పనులు చేపట్టకుండా పలువురి ఒత్తిడితో అధికారులు తమకు ఇష్టం వచ్చిన రీతిలో మారుస్తూ పనులు చేపడుతున్నారు.

తరచూ రోడ్డు ప్రమాదాలు

నెలల తరబడి రోడ్డు పనులు కొనసాగడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల కేంద్రానికి రోజూ వేలాది మంది వస్తూ పోతుంటారు. పెద్ద పెద్ద వాహనాలు సైతం ఇదే రోడ్డు గుండా వెళ్తుంటాయి. వారంలో కనీసం రెండు మూడు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు వెడల్పు పనులు నిలిచిపోయినప్పటికీ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు వెడల్పు పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండు చేస్తున్నారు.

వెంటనే పనులు ప్రారంభిస్తాం

నందిపేట మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులు చివరి దశలో ఉన్నాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు కొద్దికాలంగా నిలిపేశారు. నిలిచిన పనులను వెంటనే ప్రారంభిస్తాం. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేపడుతాం. – నామ్‌దేవ్, ఆర్ అండ్ బీ డీఈఈ, ఆర్మూర్

లిఫ్టులు తెచ్చిన ఘనత కాంగ్రెస్‌దే



నికాల్‌పూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఆలూర్‌లో ..

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్, నందిపేట్ మండలాలకు లిఫ్టులు తెచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రవీందర్ రెడ్డి అన్నారు. ఆదివారం డొంకేశ్వర్, నికాల్‌పూర్, అన్నారం, సిర్పూర్ గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి టి. జీవన్ రెడ్డి తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. లిఫ్టులతో రెండు మండలాల్లో పంటలు సమృద్ధిగా పండుతున్నాయని, కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే లిఫ్టులను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మండల అధ్యక్షులు గొడిశరం భూమేశ్ రెడ్డి, సొసైటీ చైర్మన్ భరత్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు సుమన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలూరులో ఇంటింటి ప్రచారం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, ముత్యం, సంజీవ్, చిరంజీవి, చిన్నా రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో జీవన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్ తదితరులున్నారు. నాయకులు యూనిస్, అన్వర్, గంగాధర్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌రెడ్డి

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



ఓటు హక్కును వినియోగించుకుంటున్న పోలీస్ సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా కొనసాగుతుంది. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ ఉద్యోగులు, టీఎన్జీవోస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఫారం–1 సమర్పించి ఓటేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కోసం 408 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు 364 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే హోమ్ ఓటింగ్ కోసం 390 మంది దరఖాస్తు చేసుకోగా 374 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాజాగౌడ్ పర్యవేక్షిస్తున్నారు.

ముప్కాల్ మండల పరిధిలో..

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో ఐదుగురు, నల్లూరులో ముగ్గురు ఓటర్లు ఇంటి నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం నుంచి ఇంటింటికి పోలింగ్ సిబ్బంది తిరుగుతూ బ్యాలెట్ పత్రాలతో ఓటింగ్ పూర్తి చేశారు. ఓటింగ్ సందర్భంగా ఏ పార్టీ నాయకులను దగ్గరలోకి అనుమతించలేదు. పీవో, ఏపీవో, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

బుద్దె రాజేశ్వర్ సేవలు ఆదర్శనీయం



సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి

బోధన్: సీనియర్ నాయకుడు బుద్దె రాజేశ్వర్ సేవా తత్పరత ఆదర్శనీయమని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. తన రాజకీయ జీవితంలో పార్టీలకతీతంగా సేవలందించి ,గ్రామాభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. సీనియర్ నాయకుడు బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, పార్టీలకతీతంగా గ్రామస్తులు, అభిమానులు ఆదివారం సాలూర మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో సంస్మరణ సభను నిర్వహించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, రాజేశ్వర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్మరణ సభకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా హాజరై మాట్లాడారు. రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. రాజేశ్వర్ సతీమణి బుద్దె సావిత్రి, వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గంగాధర్‌రావు పట్వారీ, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ వీఆర్ దేశాయ్, మాజీ జెడ్పీటీసీలు అల్లె లావణ్య, ఇల్తెపు శారద, తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

బోధన్: సాలూర మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు, బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త రాజేశ్వర్ స్మారకార్థం ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆచన్‌పల్లి సహకారంతో గ్రామ యువకులు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 61 మంది యువకులు రక్తదానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు బసవేశ్వర్‌రావు, చక్రవర్తి, హరిబాబు, సాంబిరెడ్డి, రామక్రిష్ణ, శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న గ్రామ యువకులు

అమిత్ షా సమావేశానికి తరలిన బీజేపీ శ్రేణులు



బాల్కొండ: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కేంద్రం హోం మంత్రి అమిత్ షా సమావేశానికి బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కేంద్రంలో మూడో సారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అంబటి నవీన్, గడ్డం సంతోష్ రెడ్డి, కోమన్‌పల్లి సాయన్న తదితరులు ఉన్నారు.

ఏడాదిలోపు చక్కెర కర్మాగారాన్ని ప్రారంభిస్తాం

- బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్(బోధన్): ఏడాది లోపు బోధన్ చక్కెర కర్మాగారాన్ని ప్రారంభించి కార్మిక, కర్షకుల కష్టాలను కడతేరుస్తామని, ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి. సుదర్శన్ రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం అమ్దాపూర్, బెల్లాల్ గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చెప్పిన మాటలు విని ప్రజలు మోసపోవద్దన్నారు. అమ్దాపూర్‌లోని కొంతమంది బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ నేతలు కుల, మతాల మధ్య చిచ్చు పెట్టి యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. అమ్దాపూర్‌లో పోరెడ్డి గంగాధర్ నాయకత్వంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బోధన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేశ్వరరావు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, అందాపూర్ సొసైటీ మాజీ చైర్మన్ పోరెడ్డి గంగాధర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్ర పల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో భారీగా చేరికలు



ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న మదన్‌పల్లి ఎంపీటీసీ

మాక్లూర్: మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరు ఒడ్డెన్న కాంగ్రెస్ పార్టీని వీడి ఆదివారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. గోవూరు ఒడ్డేన్న వృత్తి రీత్య కళాకారుడు. బీఆర్ఎస్ తరపున మదన్‌పల్లి ఎంపీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. కొన్ని అనివార్య కారణాలవల్ల బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ఇటీవల మదన్‌పల్లిలో ఆయనకు ప్రత్యర్థులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు, బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు అవినీతి నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్న సమాచారం రావడంతో.. కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరినట్లు ఆయన వెల్లడించారు.

దేవక్కపేట్ గ్రామానికి చెందిన పలువురు..



మల్లికార్జున్ రెడ్డి సమక్షంలో..

భీమ్‌గల్: మండలంలోని దేవక్కపేట్ గ్రామానికి చెందిన సుమారు 30 మంది ఆదివారం బీజేపీలో చేరారు. బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లికార్జున్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధికార ప్రతినిధి నాగార్జున్ రెడ్డి, మూడెడ్ల శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో అర్వింద్, మల్లికార్జున్‌రెడ్డి

మాజీ ఎంపీటీసీ సభ్యులు..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్ర మాజీ ఎంపీటీసీ సభ్యులు చిలుక గోపాల్, పెంటు గంగాధర్‌లు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా గౌతం గౌడ్



బోధన్: పట్టణ కేంద్రానికి చెందిన ఏనుగంటి గౌతం గౌడ్ బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి ఆయనకు నియామక పత్రం అందించారు. పార్టీ సీనియర్ నాయకులు నర్సింహా రెడ్డి, సుధాకర్‌చారి, పట్టణ అధ్యక్షుడు బాల్‌రాజ్, గోపికిషన్, కందికట్ల వాసు, హన్మాండ్లు చారి, గుంత గంగాధర్, లింగం కార్యకర్తలు పాల్గొన్నారు.

శాకాహార ర్యాలీ



వేల్పూర్: అమీనాపూర్‌లో ఆదివారం ధ్యాన దంపతులు రెడ్డి దశవ్వ, మల్లయ్య ఆధ్వర్యంలో మెగా శాకాహార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి జ్ఞానదాతగా పిరమిడ్ సేవాదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ధ్యాన గద్దర్ భూపతి రాజు హాజరై మాట్లాడారు. నక్సలైట్ ఉద్యమంలో పాల్గొన్న తాను ప్రస్తుతం ధ్యాన మార్గంలోకి వచ్చానని వెల్లడించారు. ఈ ధ్యానం వల్ల తన జీవితంలో ఎన్నో మార్పులు వచ్చాయని వివరించారు. నిజామాబాద్ జిల్లా సభ్యులు బొడ్డు దయానంద్, మామిడి లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో ఇంటింటి ప్రచారం



నేహాబేగంను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఎడపల్లి(బోధన్): నెహ్రూనగర్‌లో కాంగ్రెస్ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాసరావు మాట్లాడుతూ..పేదలకు సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ద్వారా అందుతాయని చెప్పారు. అనంతరం గ్రామానికి చెందిన నేహాబేగంకు రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో మెడల్ రావడంతో పులి శ్రీనివాస్‌రావు, బిల్లా రామ్మోహన్ సన్మానం చేశారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈరంటి లింగం, మాజీ సర్పంచ్ అమానుల్లా, ఖాజా బేగ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలీం,మాజీ ఉపసర్పంచ్ ఫెరోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థికి సీపీఐ ఎంఎల్ మద్దతు

మాక్లూర్: ఇండియా కూటమి పార్లమెంట్ అభ్యర్థులకు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి ఆదివారం వెల్లడించారు. పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదన్నారు. పైగా ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించిందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించటంలో పూర్తిగా విఫలమైందన్నారు.

ముగిసిన అఖండ హరినామ సప్తాహం



బోధన్‌రూరల్: కల్దుర్కి గ్రామంలో శ్రీరామ హనుమాన్ ఆలయంలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహం ఆదివారం ముగిసింది. చివరి రోజు ప్రముఖ పండితులు సంజయ్ మహారాజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రవచనం చేశారు. ప్రతిఒక్కరూ దైవనామస్మరణను అలవరుచుకోవాలన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

పోతంగల్‌లో కొనసాగుతున్న సప్తాహం

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని శ్రీ విఠల్ రుక్మిణి సంత్‌గోరా కుంభర్ ఆలయంలో ఆరు రోజులుగా అఖండ హరినామ సప్తాహం కొనసాగుతుంది. ఈ నెల 6న ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు వారు వెల్లడించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	మంజుమ్మల్ బాయ్స్ – 01.05, 7.00 టిల్లు స్క్వేర్ – 4.00, శబరి (తెలుగు) – 10.15
స్క్రీన్-2 –	ప్రసన్నవదనం (తెలుగు)– 12.40, 6.40, 9.45 మంజుమ్మల్ బాయ్స్ – 3.45
స్క్రీన్-3 –	ఆ ఒక్కటీ అడక్కు – 12.30, 3.25, 6.20, 9.15
స్క్రీన్-4 –	బాక్ (తెలుగు)– 12.00, 3.10, 6.20, 9.30

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899